https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 02 సంచిక : 60 గురువారం 2-07-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం
Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో
నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా
రాయాలని కోరుకుంటున్నారా?
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో
పనిచేసేందుకు విలేఖరులు కావలెను...
మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు
9989788438, 9505485656.

# ఏఐ మెదడు.. ఇన్‌ఫ్రా శరీరం

- భారత్‌లోకి ఫిజికల్ ఇంటెలిజెన్స్ సేవలు
- అనలాగ్‌తో మేఘా ఇంజనీరింగ్ జాయింట్ వెంచర్
- వచ్చే 3-4 ఏళ్లలో రూ.4,750 కోట్ల పెట్టుబడులు
- ట్రాఫిక్ నిర్వహణకు ఏఐని వాడండి
- మేఘా ఎండీ, అనలాగ్ సీఈవోతో భేటీలో సీఎం
- హైదరాబాద్ ట్రాఫిక్ పైలట్ ప్రాజెక్టు వివరాలను రేవంత్ రెడ్డికి తెలిపిన రెండు సంస్థల ప్రతినిధులు



**హైదరాబాద్, జూలై 1**

మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్).. భారత్‌లోకి తొలిసారిగా ఫిజికల్ ఇంటెలిజెన్స్ సొల్యూషన్స్‌ను అందుబాటులోకి తీసుకురానుంది. ఇందుకోసం అబుదాబీ కేంద్రంగా ఉన్న టెక్నాలజీ సంస్థ 'అనలాగ్'తో కలిసి ఎంఈఐఎల్ జాయింట్ వెంచర్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు బుధవారం ఇక్కడ ఎంసీఆర్‌హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో.. ఎంఈఐఎల్ మేనేజింగ్ డైరెక్టర్ పీవీ కృష్ణా రెడ్డి, అనలాగ్ వ్యవస్థాపకుడు, సీఈవో అలెక్స్ కిప్‌మన్ అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన తదుపరి తరం ఇంటెలిజెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఫిజికల్ ఇంటెలిజెన్స్ ఆధారిత పరిష్కారాలు, హైదరాబాద్ ట్రాఫిక్ పైలట్ ప్రాజెక్టు వివరాల గురించి వారు ముఖ్యమంత్రికి వివరించారు. సెన్సర్లు, రోబోటిక్స్, ఫిజికల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతతో ట్రాఫిక్ రద్దీని ముందుగానే గుర్తించడం, సిగ్నళ్లను స్వయంచాలకంగా నియంత్రించడం, నీటి లీకేజీలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టడం, అవసరానికి అనుగుణంగా విద్యుత్ వినియోగాన్ని నిర్వహించడం, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్, అగ్నిమాపక వాహనాలకు గ్రీన్ కారిడార్ కల్పించడం వంటివి సాధ్యమవుతాయని సీఎంకు తెలిపారు. కాగ్నిటివ్ సిటీస్ రూపకల్పనకు ఉన్న అవకాశాలను ఆయనకు వివరించగా.. రాజధాని హైదరాబాద్‌లో ట్రాఫిక్ నిర్వహణకు కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత సాంకేతికతను వినియోగించాలని సీఎం వారికి సూచించారు. నగరంలోని అన్ని ట్రాఫిక్ సిగ్నళ్లనూ ఒకే వ్యవస్థలో అనుసంధానం చేసి, ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా స్వయంచాలకంగా పనిచేసే విధానాన్ని అమలు చేయాలన్నారు. వాతావరణ పరిస్థితుల్లో వచ్చే మార్పులను సైతం పరిగణనలోకి తీసుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేలా సాంకేతికతను ఉపయోగించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రభుత్వ సలహాదారు కె.రామకృష్ణారావు, ఇన్వెస్ట్ సీఈవో, హైదరాబాద్ మెట్రో రైల్ అదనపు ఎండీ బి.అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. చెరి సగం భాగస్వామ్యంతో ఏర్పాటు చేస్తున్న ఈ జాయింట్ వెంచర్ కోసం రానున్న మూడు నుంచి నాలుగేళ్లలో 30 కోట్ల డాలర్ల నుంచి 50 కోట్ల డాలర్ల (సుమారు రూ.2,850 కోట్ల నుంచి రూ.4,750 కోట్లు) వరకు పెట్టుబడులు పెట్టనున్నట్లు ఎంఈఐఎల్ ఎండీ పీవీ కృష్ణారెడ్డి చెప్పారు. ఫిజికల్ ఇంటెలిజెన్స్‌లో.. యంత్రాలు కేవలం ప్రోగ్రామింగ్‌పై ఆధారపడకుండా, పరిస్థితులకు తగ్గట్టుగా వ్యవహరించడం, సముచిత నిర్ణయాలు తీసుకోవడం వంటి సామర్థ్యాలను కలిగి ఉంటాయని ఆయన తెలిపారు. పట్టణ ప్రాంతాలు ప్రధానంగా ఎదుర్కొంటున్న ట్రాఫిక్, సెక్యూరిటీ వంటి కీలకమైన సమస్యలను పరిష్కరించేందుకు ఫిజికల్ ఇంటెలిజెన్స్ ఎంతగానో దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం పైలెట్ ప్రాజెక్ట్ ప్రాతిపదికన ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, విద్యుత్ గ్రిడ్ సామర్థ్యం పెంపుతో పాటు విద్య, ఆరోగ్య రంగాల్లో ఈ సొల్యూషన్స్‌ను వినియోగిస్తున్నామని.. వచ్చే మూడు నెలల్లో వీటిని వాణిజ్యపరంగా అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నామని కృష్ణా రెడ్డి చెప్పారు.

మిగతా 2లో...

# 'అయోధ్య' పై నబీన్ మాట్లాడరేం?

- బీజేపీ ముక్త్ భారత్‌ను ప్రజలు కోరుకుంటున్నారు
- యాదగిరిగుట్ట అభివృద్ధి కోసమే కమిటీ
- రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలతో ఏకీభవిస్తాను
- దీనిపై సీఎంతో మాట్లాడతా?: మహేశ్‌గౌడ్



**హైదరాబాద్, జూలై 1**

బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ రాష్ట్ర పర్యటన అట్టర్ ఫ్లాప్ అయిందని టీపీసీసీ చీఫ్ మహ్హ?షగౌడ్ ఎద్దేవా చేశారు. అయోధ్య రామ మందిరంలో హుండీ కానుకల దోపిడీ గురించి ఆయన ఎందుకు మాట్లాడలేదు? కాళేశ్వరం అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలంటూ తెలంగాణ ప్రభుత్వం లేఖ రాసినా.. ఎందుకు పట్టించుకోవడం లేదు? అని ప్రశ్నించారు. ప్రజలు ప్రస్తుతం బీజేపీ ముక్త్ భారత్‌ను కోరుకుంటున్నారని పేర్కొన్నారు. గాంధీభవన్ లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో సీఎం రేవంత్ అన్నట్లుగా రాష్ట్రంలో 2034 వరకూ కాంగ్రెస్ ప్రభుత్వమే కొనసాగుతుందన్నారు. బీజేపీ.. ఎన్ని పార్టీలతో కలిసి వచ్చినా తెలంగాణలో కాంగట?ౖసను ఓడించలేదని ధీమా వ్యక్తం చేశారు. కులం, మతం పేరుతో ఎంత రెచ్చగొట్టాలనుకున్నా ఇక్కడి ప్రజలు సంయమనం పాటిస్తారని అన్నారు. కేసీఆర్ చేసిన అప్పుల్ని తీర్చడానికే ప్రభుత్వం నానా తంటాలు పడుతుంటే.. కొత్తగా వీబీ జీరామ్‌జీ పేరిట కేంద్రం కొత్తగా భారం మోపడం సరికాదన్నారు. మూసీ ఆధునికీకరణ తొలి దశ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.7వేల కోట్లని, అందులో లక్షల కోట్ల అవినీతి ఎలా జరుగుతుందని ప్రశ్నించారు.

మిగతా 2లో...

# మోదీ దూరదృష్టి వల్లే ఇంధన కొరత రాలేదు

## సంక్షోభంలో ప్రజలకు అండగా నిలిచారు: కిషన్‌రెడ్డి



**న్యూఢిల్లీ, జూలై 1**

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా దాదాపు నాలుగు నెలల పాటు హోర్ముజ్ జలసంధి మూతపడినప్పటికీ, ప్రధాని నరేంద్ర మోదీ దూరదృష్టి, ముందస్తు వ్యూహాల వల్ల దేశంలో పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ కొరత రాలేదని కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయంగా ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ దేశంలో ఒక్క పెట్రోల్ బంక్ కూడా ఖాళీ కాలేదని, ప్రజలకు గ్యాస్ సిలిండర్ల కొరత రాలేదని ఆయన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ మార్కెట్‌లో 14.2 కిలోల డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ ధర రూ.1,600కి చేరినప్పటికీ, దేశ ప్రజలకు దాన్ని సుమారు రూ.900కే అందుబాటులో ఉంచామని వివరించారు. కరోనా మహమ్మారి, రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, ప్రస్తు పశ్చిమాసియా సంక్షోభం వంటి అంతర్జాతీయ సవాళ్లు ఎదురైనా.. దేశ ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రధాని మోదీ తీసుకున్న నిర్ణయాలు కోట్లాది మంది భారతీయులకు రక్షణ కవచంగా నిలిచాయని కిషన్ రెడ్డి కొనియాడారు. ప్రపంచవ్యాప్తంగా ఇంధన మార్కెట్లలో అనిశ్చితి నెలకొన్నప్పటికీ, కేంద్రప్రభుత్వం దేశ ప్రజల ప్రయోజనాలకే మొదటి ప్రాధాన్యం ఇచ్చిందని ఆయన స్పష్టం చేశారు. అంతర్జాతీయ సంక్షోభ సమయంలో దేశ ఇంధన భద్రతను కాపాడటం, పరిస్థితులు మెరుగుపడగానే ప్రజలకు ఊరట కల్పించడం ఎన్డీయే ప్రభుత్వ సుపరిపాలనకు నిదర్శనమని కిషన్‌రెడ్డి కొనియాడారు.

## కేటీఆర్‌వి చిలుక పలుకులు: మంత్రి జూపల్లి



**హైదరాబాద్, జూలై 1:**

రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చింది బీఆర్ఎస్సేనని, ఇప్పుడు కేటీఆర్ చిలుక పలుకులు పలుకుతున్నారని మంత్రి జూపల్లి కృష్ణారావు మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో రూ.8లక్షల కోట్లకుపైగా అప్పులు చేశారని, తాను చెప్పింది అబద్ధమని నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని పేర్కొన్నారు. ఈ విషయమై చర్చకు సిద్ధమేనా? అని కేటీఆర్‌కు సవాల్ విసిరారు. కేటీఆర్, హరీశ్‌రావు రాష్ట్ర ఖజానాకు చిల్లు పెట్టారని, ప్రజల సొమ్ముతో జల్సాలు చేశారని ఆక్షేపించారు. అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోనే రూ.20,157 కోట్ల రుణమాఫీ చేసిన ఘనత రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు.

# ఎందుకింత కక్ష?

## నాడు మూడు ముక్కలు.. ఇప్పుడేమో మావిగన్

- రాజధానిని ఇంతలా వ్యతిరేకించే పార్టీ రాష్ట్రానికి అవసరమా?
- నాడు రాజధానికి మద్దతు ప్రకటించి..అడుగడుగునా జగన్ అడ్డంకులు
- నిన్న పరిరక్షణ పేరిట రౌడీలతో దండయాత్ర
- అధికారం కోసం మళ్లీ అరాచక పర్వం
- నాడు సభలో నా భార్యను అవమానించారు
- నిన్న దళిత హోం మంత్రిని కించపరిచారు
- నేడు పవన్ కుమార్తెను అవమానిస్తూ పోస్టులు
- కులం, మతం పేరుతో చిచ్చుకు ప్రయత్నాలు
- ఈ గంజాయి బ్యాచ్‌కు భయపడే ప్రశ్నే లేదు
- ప్రజాస్వామ్యం, శాంతి కావాలంటే
- గొడ్డలి పార్టీని తరిమేయాలి: సీఎం చంద్రబాబు
- నెల్లూరు జిల్లాలో పింఛన్లు పంపిణీ



**నెల్లూరు, జూలై 1**

ఒక్కసారి అధికారం ఇచ్చిన పాపానికి గొడ్డలి పార్టీ రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు మండిపడ్డారు. "ఒక రాజధాని మీద ఎందుకు ఇంత కక్ష? రాష్ట్రానికి ఒక రాజధాని ఉండటాన్ని ఇంతలా, ఇన్ని రకాలుగా వ్యతిరేకించే పార్టీని రాజకీయ పార్టీ అంటారా? ఇలాంటి పార్టీ మనకు అవసరమా? ప్రజలే ఆలోచించుకోవాలి." అని సీఎం అన్నారు. రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంట్‌లో తీర్మానం చేస్తే గొడ్డలి పార్టీ దానిని వ్యతిరేకించిందని, ఇప్పుడు కొత్తగా మావిగన్ అని అంటోందని ఆయన ఆగ్రహించారు. నెల్లూరు జిల్లా చిల్లకూరు మండలం పున్నపువారిపాలెంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను సీఎం అందించారు. అనంతరం 'పేదల సేవలో' ప్రజావేదికపై ఆయన ప్రసంగించారు. "ప్రపంచ దేశాల్లో ఏ రాష్ట్రంలో లేనంత గొప్పగా 25 రకాల సామాజిక పింఛన్లు పంపిణీ చేస్తున్నాం. రెండేళ్లలోనే పింఛన్ల కోసం రూ. 65,598 కోట్లు ఖర్చు చేశాం. ప్రతి నెలా మొదటి తేదీ వచ్చిందంటే ఆ నెల మొత్తం పడిన శ్రమనంతా మరిచిపోతా. పేదల మధ్య గడపడం నాకెంతో తృప్తి." అని వ్యాఖ్యానించారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి కట్టుబడిన విధానాన్ని వివరిస్తూ, అరాచకాలు సృష్టించాలని ప్రయత్నించే వారిని ఉక్కుపాదం కింద అణచివేస్తామని హెచ్చరించారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..


**నాతోనే కన్నీళ్లు పెట్టించిన సైకోలు వీళ్లు..**

"తీవ్రవాదులు నన్ను చంపడానికి క్లైమోర్‌మైన్లు పేల్చినప్పుడు కూడా నేను కంట తడి పెట్టలేదు. అలాంటిది నా భార్య గురించి అసెంబ్లీ సాక్షిగా అవమానకరంగా మాట్లాడినప్పుడు మాత్రం, ఉక్కుమనిషినైన నేనే తట్టుకోలేక, కన్నీళ్లు పెట్టుకున్నాను. కుటుంబ సభ్యులను అవమానించడం ద్వారా మమ్మల్ని కుంగదీయాలని సైకో నాయకుడు తన మనుషులను రెచ్చగొడుతున్నాడు. మొన్న గొడ్డలి పార్టీ మాజీ మంత్రి... దళిత మహిళ అయిన హోం మంత్రి అనితను అవమానకరంగా మాట్లాడాడు. నిన్న నా మిత్రుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కుమార్తె గురించి అవమానకరంగా పోస్టింగ్‌లు పెట్టారు. కులాల పేరుతో, మతాల పేరుతో రాష్ట్రంలో చిచ్చు రగిలించాలని చూస్తున్నారు. ఇలాంటి వాటికి నేను భయపడే ప్రసక్తి లేదన్నారు.

మిగతా 2లో...

# విజయ్ ప్రభుత్వాన్ని కూల్చే కుట్ర!

- ఒక్కో ఎమ్మెల్యేకు రూ.35 కోట్ల ఆఫర్.. టీవీకే ఎమ్మెల్యేతో యూట్యూబర్ బేరసారాలు
- పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఐదుగురి అరెస్టు
- నిందితులు డీఎంకే మాజీ మంత్రి సెంథిల్‌బాలాజీ అనుచరులు



**చెన్నై, జూలై 1:**

తమిళనాడులోని విజయ్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు ఒక్కో ఎమ్మెల్యేకు రూ.35 కోట్లు ఆఫర్ చేసిన ఆరోపణపై ఒక యూట్యూబర్ సహా ఐదుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. పార్టీ మారాలని ఒత్తిడి చేస్తూ తమిళగ వెట్రి కళగం(టీవీకే) పార్టీకి చెందిన పదిమంది శాసనసభ్యులకు తలా ముప్పై ఐదు కోట్ల రూపాయలు ఇచ్చేందుకు బేరసారాలు జరిపారన్నది ఆరోపణ. అరెస్టయిన ఐదుగురు వ్యక్తులు డీఎంకేకు చెందిన మాజీమంత్రి సెంథిల్‌బాలాజీ అనుచరులు. కృష్ణగిరి జిల్లా ఊత్తాంగరై నియోజకవర్గ టీవీకే ఎమ్మెల్యే ఎన్.ఇళయరాజాకు ఇటీవల ఓ యూట్యూబర్ ఫోన్ చేసి ఈ బేరసారాలు జరపటంతో ఆయన గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్ అమల్‌రాజ్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదుపై విచారణ జరిపి తగు చర్యలు చేపట్టాలంటూ ట్రిప్లికేన్ పోలీసులను కమిషనర్ ఆదేశించారు. దీనిపై ప్రత్యేక దళం పోలీసులు లోతైన విచారణ జరిపి చెన్నై ఆరుంబాక్కం ప్రాంతానికి చెందిన యూట్యూబర్ తిరునావుక్కరసును అరెస్టు చేశారు. దర్యాప్తులో అతడు వెల్లడించిన వివరాల ఆధారంగా తిరుచ్చికి చెందిన నరేష్, చెన్నైకి చెందిన త్యాగరాజన్‌లను అరెస్టు చేశారు. ఈ వ్యవహారంలో మాజీ మంత్రి సెంథిల్‌బాలాజీ, ఆయన సోదరుడు అశోక్‌కుమార్, వీరి అనుచరులకు సంబంధాలు ఉన్నట్లు దర్యాప్తులో కనుగొన్నారు. ఆ మేరకు కరూర్‌లో ఉన్న సెంథిల్‌బాలాజీ అనుచరుడు, ప్రముఖ ఫైనాన్స్ సంస్థ అధినేత రమేష్, శక్తిమెస్ నిర్వాహకుడు కార్తీలను పోలీసులు అరెస్టు చేశారు. వీరిద్దరినీ బుధవారం చెన్నైకి తీసుకొచ్చి రహస్య ప్రదేశంలో విచారణ జరుపుతున్నట్లు తెలిసింది.

మిగతా 2లో...

# భల్లాలదేవుడికి పట్టిన గతే రేవంత్‌కు!

## ఆయన పాలనపై ప్రజలు కోపంగా ఉన్నారు: కేటీఆర్



**హైదరాబాద్, జూలై 1**

రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ రేవంత్ రెడ్డి పాలనపై కోపంగా ఉన్నారని, వారు అన్నీ గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో బాహుబలి సినిమాలో భల్లాలదేవుడికి పట్టిన గతే రేవంత్‌కూ పడుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తాను నమ్మిన హిట్లర్ కథ ఎలా ముగిసిందో రేవంత్ రాజకీయ జీవితానికి కూడా ప్రజలు అలాగే ముగింపు పలుకుతారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ కార్యాలయంలో బుధవారం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. తన రాష్ట్రం గురించి ఏ ముఖ్యమంత్రి కూడా మాట్లాడని విధంగా రేవంత్ మాట్లాడుతున్నారని విమర్శించారు. ఎయిడ్స్‌రోగి, క్యాన్సర్ రోగి మాదిరిగా రాష్ట్రం దివాలా తీసిందంటూ తెలంగాణపైనే రేవంత్ విషం చిమ్ముతున్నారని విమర్శించారు. కేసీఆర్‌తో కూర్చుని చర్చ చేస్తే తన స్థాయి పెరుగుతుందని రేవంత్ అనుకుంటున్నారని, అందుకే రాష్ట్రం క్లిష్టపరిస్థితుల్లో ఉందని రేవంత్ చెబుతున్నారని విమర్శించారు.

# విజయ్ ప్రభుత్వాన్ని..(మొదటిపేజీ తరువాయి)

ఇక తిరునావుక్కరసు, నరేష్, త్యాగరాజన్‌లను పోలీసులు ఎగ్మూరు కోర్టులో హాజరుపరచగా 15 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించారు.

**ఓ ప్రధాన పార్టీ సూచనలతోనే..**

చెన్నై నుంచి ఇండియన్ పొలిటికల్ డెమోక్రటిక్ స్ట్రాటజ?స(ఐపీడీఎస్) అనే అభిప్రాయ సేకరణ సంస్థ తరఫున మాట్లాడుతున్నానంటూ తిరునావుక్కరసు అనే వ్యక్తి ఇటీవల టీవీకే శాసనసభ్యుడు ఇళయరాజాకు ఫోన్ చేశారు. ఓ ప్రధాన పార్టీకి చెందిన ప్రముఖుల సూచనల ప్రకారం తాను నేరుగా కలుసుకోవాలనుకుంటున్నానని తెలిపారు. ఆ సమయంలో తాను బిజీగా ఉన్నానంటూ ఇళయరాజ్ ఫోన్ కట్ చేశారు. తిరునావుక్కరసు మళ్లీ ఆయన్ని ఫోన్‌లో సంప్రదించి అసెంబ్లీలో స్పీకర్‌కు వ్యతిరేకంగా ఓ తీర్మానం చేయబోతున్నారని, ఆ తీర్మానానికి జరిగే ఓటింగ్‌లో టీవీకేకు వ్యతిరేకంగా ఓటేయాలని, అలా చేస్తే రూ.35 కోట్ల దాకా చెల్లిస్తామని తెలిపాడు. పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరించే ప్రసక్తే లేదని ఇళయరాజా ఫోన్ పెట్టేశారు. ఆ తర్వాత తిరునావుక్కరసు మళ్లీమళ్లీ ఫోన్ చేసి తన సంభాషణను బయటపెడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని పదే పదే బెదిరించాడు. తన ప్రభుత్వాన్ని కాపాడుకోడానికి ఇతర పార్టీల ఎమ్మెల్యేల కొనుగోలుకు బేరసారాలు జరుపుతున్న టీవీకే అధ్యక్షుడు, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌పై చర్యలు తీసుకోవాలని గవర్నర్ అర్లేకర్‌కు డీఎంకే పార్టీ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు డీఎంకే వ్యవస్థాపక కార్యదర్శి ఆర్ఎస్ భారతి బుధవారం గవర్నర్‌కు లేఖ రాశారు. ఎండీఎంకే తరఫున కడయనల్లూరు, సీర్గాళి నియోజకవర్గాలలో డీఎంకే చిహ్నం ఉదయించే సూర్యుడి గుర్తుపై పోటీ చేసి గెలిచిన టీఎం రాజేంద్రన్, సెంథిల్ సెల్వన్ తో రాజీనామా చేయించేందుకు విజయ్ ప్రయత్నించారని లేఖలో పేర్కొన్నారు.

ఈ విషయాన్ని తమ కూటమి నుంచి వైదొలగిన ఎండీఎంకే నేత వైగో విలేకరుల సమావేశంలోనే ప్రకటించారని తెలిపారు. తమ పార్టీకి చెందిన ఇద్దరు శాసనసభ్యులు రాజీనామా చేస్తే, ఉప ఎన్నికల్లో ఆ ఇద్దరినీ గెలిపించేందుకు తానే ప్రచారం చేస్తానని విజయ్ హామీ ఇచ్చారని వైగో ఇటీవల విలేకరుల సమావేశంలో వెల్లడించారని గుర్తు చేశారు. అలా బేరసారాలు జరిపే అన్నాడీఎంకేకు చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించారని ఆరోపించారు. తన ప్రభుత్వానికి సరిపడా మెజారిటీ లేకపోవడంతో ఇతర పార్టీల ఎమ్మెల్యేలను కొనేసి గండం నుంచి బయటపడవచ్చనే తలంపుతోనే విజయ్ ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దీనిపై విచారణ జరిపించి, తగిన చర్యలు చేపట్టాలని గవర్నర్‌ను డిమాండ్ చేశారు.

# ఏఐ మెదడు.. ఇన్‌ఫ్రా..(మొదటిపేజీ తరువాయి)

ఇక.. భారత అవసరాలకు తగ్గట్టుగా ఈ జాయింట్ వెంచర్ ప్రత్యేకంగా టెక్నాలజీ సొల్యూషన్స్‌ను అభివృద్ధి చేయనుందని అనలాగ్ సీఈఓ అలెక్స్ కిప్‌మన్ వెల్లడించారు.

### ఈవీ కార్ల తయారీలోకి మేఘా..

అంతర్జాతీయ భాగస్వామితో కలిసి ఎలక్ట్రిక్ కార్ల తయారీ అవకాశాలను ఎంఈఐఎల్ పరిశీలిస్తోందని కృష్ణా రెడ్డి తెలిపారు. గ్రూప్‌నకు చెందిన ఒలెక్ష?ట్ర గ్రీన్‌టెక్ ఇప్పటికే ఎలక్ట్రిక్ బస్సుల తయారీలో కీలకంగా ఉందని, అయితే ఈవీ కార్ల తయారీ మాత్రం బీవైడీతో కాదని ఆయన పేర్కొన్నారు. మూడు నెలల్లో దీనికి సంబంధించిన వివరాలు వెల్లడించే అవకాశం ఉందని ఆయన చెప్పారు. అలాగే సెల్, బ్యాటరీ మాన్యుఫ్యాక్చరింగ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని చూస్తున్నట్లు వెల్లడించారు.

### ఫిజికల్ ఇంటెలిజెన్స్ అంటే?

సాధారణంగా రోబోలు, యంత్రాలు.. ముందే రాసిన ప్రోగ్రామింగ్ ఆధారంగా పనిచేస్తాయి తప్ప వాటికి సొంతంగా ఆలోచించే సామర్థ్యం ఉండదు. ఉదాహరణకు.. ట్రాఫిక్‌సిగ్నల్స్‌నే తీసుకుంటే.. వాటిలో ఉండే టైమర్ల ప్రకారం 30 సెకన్లు లేదా 60 సెకన్లు ఇలా ఒక నిర్ణీత సమయంపాటు వెలుగుతాయి. అంతే తప్ప ఎటువైపు ట్రాఫిక్ ఎక్కువ ఉంది? ఎటువైపు వాహనాలను ఎక్కువసేపు వదలాలి? అని ఆలోచించి పనిచేయలేవు. అదే, ఫిజికల్ ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఉంటే అది రోడ్డుపై ఉండే కెమెరాలు, సెన్సర్ల ద్వారా ట్రాఫిక్‌ను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉంటుంది.

అంబులెన్స్ వస్తున్నా.. ఒకవైపు ట్రాఫిక్ రద్దీ విపరీతంగా పెరిగిపోయినా.. అది క్షణాల్లో గమనించి, దానికి అనుగుణంగా అటువైపు గ్రీన్ సిగ్నల్ సమయాన్ని పెంచుతుంది. అలాగే.. ఎండాకాలంలో ఏదైనా ప్రాంతంలో లోడ్ ఎక్కువైతే ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం, పవర్ కట్ కావడం వంటి ఘటనలు జరుగుతాయి. అదే, ఫిజికల్ ఇంటెలిజెన్స్ ఉంటే.. గ్రిడ్ సిస్టమ్ ఏ ప్రాంతంలో కరెంటు వాడకం అసాధారణంగా పెరుగుతోందో గమనిస్తుంటుంది. ఎక్కడైనా ట్రాన్స్‌ఫార్మర్ విఫలమయ్యే అవకాశం ఉంటే ముందే గమనించి అక్కడ లోడ్‌ను ఆటోమేటిగ్గా వేరే లైన్‌కి మారుస్తుంది. ఎక్కడైనా తీగలు తెగితే ఆ విషయాన్ని త్వరగా గుర్తిస్తుంది. ఇవేకాదు.. పరిశ్రమల్లో, వ్యవసాయంలో ఇలా పలు రంగాల్లో ఫిజికల్ ఇంటెలిజెన్స్ ఎంతగానో ఉపయోగపడుతుంది.

# ఎందుకింత కక్ష...(మొదటిపేజీ తరువాయి)

కులాలు, మతాల మధ్య చిచ్చు రగిలిస్తున్నారు. నేను ఎన్నో పార్టీలను చూశాను. కానీ నేరాలు చేయించే పార్టీని, నేరస్థులను కాపాడే పార్టీని, నేరస్థులతో రాజకీయాలు చేయించే పార్టీని నా 50 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎప్పుడూ, ఎక్కడా చూడలేదు. విజయవాడలో ఒక వ్యక్తి మిస్ అయ్యాడు. దీనిపై విచారణకు సిట్‌ను నియమించాను. కానీ గొడ్డలి పార్టీ సైకోలు ఆ సంఘటనకు కులం ముద్ర వేశారు. పవన్ మీద నిందలు వేశారు. ఆయన కుమార్తె మీద పోస్టింగ్‌లు పెట్టారు. ఇదేం అన్యాయం? మహిళలను గౌరవం లేకుండా అవమానిస్తారా? ఒక్కసారి అధికారం ఇచ్చిన పాపానికి రాష్ట్రాన్ని అధోగతిపాల్జేశారు. గంజాయి హబ్‌గా మార్చేశారు. గత ప్రభుత్వంలో స్వేచ్ఛగా ఉన్నారా? ఈ ప్రభుత్వంలో స్వేచ్ఛగా ఉన్నారా? శాంతిభద్రతలు అప్పుడు బాగున్నాయా.. లేక ఇప్పుడా? గంజాయి బ్యాచ్‌ను అణచివేశామా లేదా!? రౌడీయిజాన్ని తరిమికొట్టామా లేదా!? మీరే చెప్పండి.”

**సుస్థిర అధికారంతోనే అభివృద్ధికి బాట**

“గుజరాత్‌లో 25 సంవత్సరాలుగా ఒకే పార్టీ అధికారంలో ఉంది. అందువల్లే ఆ రాష్ట్రం అభివృద్ధిలో నంబర్ వన్ స్థానంలో ఉంది. కేంద్రంలో నరేంద్రమోదీ మూడు పర్యాయాలు ప్రధానిగా ఎన్నికయ్యారు. ఆ కారణంగానే దేశవ్యాప్తంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ప్రపంచ దేశాల్లో భారత్ బలమైన దేశంగా గుర్తింపు పొందింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నేను వరుసగా తొమ్మిదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నాను. హైదరాబాద్‌ను అభివృద్ధి చేశాను. ఇప్పుడు ఆ నగరం దేశంలో నంబర్ వన్ స్థానంలో ఉంది. అలాంటి అవకాశమే ఇక్కడ కూటమి ప్రభుత్వానికి ఇవ్వండి. రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా అభివృద్ధి చేసి చూపిస్తాం. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో విధ్వంసం జరిగింది. సాధారణంగా అయితే 30, 40 ఏళ్లపాటు రాష్ట్రం కోలుకునే పరిస్థితి లేదు. కానీ నిరంతర కృషితో, కేంద్రం సహకారంతో రెండేళ్లలోనే ఏపీని గాడిలో పెట్టాం. మళ్లీ ఎన్నికల్లో తప్పుడు నిర్ణయం తీసుకుంటే, రాష్ట్రం అధోగతిపాలవుతుంది. వైకుంఠపాళీ ఆడినట్లే అవుతుంది. నేరస్థులకు వంత పాడటం మంచిది కాదు. జీవితంలో అలాంటి పార్టీ గెలవడానికి వీలులేదని సంకల్పం పూనాలి.”

**నెల్లూరు జిల్లాకు 27 భారీ పరిశ్రమలు**

“నెల్లూరు జిల్లాకు 27 భారీ పరిశ్రమలు రాబోతున్నాయి. రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన ఉదయగిరి ప్రాంతంలో డిఫెన్స్ పరిశ్రమలు వస్తున్నాయి. క్రిష్ సిటీ దేశంలో నంబర్ వన్ పారిశ్రామికవాడగా అభివృద్ధి చెందబోతోంది. రెండ్రోజుల్లో కడపలో స్టీల్ ప్లాంట్‌కు భూమి పూజ చేయబోతున్నాం. సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గించడమే నా జీవిత ఆశయం. అందుకే బంగారు కుటుంబాల పథకం ఎంచుకున్నాను. ఆగస్టు 15 నుంచి సంజీవిని పథకం అమలులోకి వస్తుంది. వెలిగొండ ప్రాజెక్టు ఫస్ట్ ఫేజ్ ఈ ఏడాదిలోపు పూర్తి చేస్తాం. నిర్వాసితులకు తొలివిడతగా 300 కోట్లు ఇచ్చాం. ఈ రెండేళ్ల కాలంలో దేశంలోకి వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో 26శాతం వాటా ఆంధ్రకు వచ్చాయంటే రాష్ట్రం, ప్రభుత్వం పట్ల పారిశ్రామికవేత్తలకు ఉన్న నమ్మకం ఎలాంటిదో అర్థం చేసుకోవాలి. ఈ అభివృద్ధి ఇలాగే కొనసాగాలంటే రాజకీయంగా ప్రజలు సరైన నిర్ణయం తీసుకోవాలి. నేరాలు చేసే పార్టీని, నేరస్థులను కాపాడే పార్టీని, నేరస్థులతో రాజకీయాలు చేయించే గొడ్డలి పార్టీని భవిష్యత్‌లో గెలిపించకూడదు” అని చంద్రబాబు కోరారు. కార్యక్రమంలో మంత్రులు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, ఫరూక్, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్, ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర, బల్లి కల్యాణ్ చక్రవర్తి, కలెక్టర్ హిమాన్షు శుక్లా తదితరులు పాల్గొన్నారు.

**నెల్లూరు కలెక్టర్ పనితీరు భేష్.. హిమాన్షు శుక్లాకు సీఎం అభినందన**

ప్రజా సేవలో నెల్లూరు అధికార యంత్రాంగం పనితీరు అద్భుతంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంసించారు. ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న 57 సేవలకుగాను 55 సేవల అమలులో ప్రజల సంతృప్తి శాతం రాష్ట్ర సగటు కంటే నెల్లూరు జిల్లాలో ఎక్కువగా ఉందని తెలిపారు. సంతృప్తి స్థాయిలో గతేడాది రెండో స్థానంలో ఉన్న జిల్లాను, ఇప్పుడు మొదటి స్థానంలోకి తీసుకొచ్చారంటూ కలెక్టర్ హిమాన్షు శుక్లాను అభినందించారు. ప్రజావేదిక కార్యక్రమంలో వివిధ శాఖల ప్రగతి నివేదికలను చంద్రబాబు చదివి వినిపించారు. పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో మెరుగైన పనితీరు కనబరుస్తున్నారంటూ జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లను అభినందించారు. గంజాయి, మహిళలపై నేరాల నియంత్రణలో నెల్లూరు జిల్లా పోలీసు శాఖ సమర్థవంతంగా పనిచేస్తోందంటూ ఎస్పీ అజిత వేజండ్లను ప్రశంసించారు.

# ఆదాయ పెంపుపై దృష్టి పెట్టండి

**- ఇందుకోసం చేజింగ్ సెల్‌ను ఏర్పాటు చేయండి- అధికారులకు సీఎం రేవంత్ ఆదేశాలు**

**హైదరాబాద్, జూలై 1**

ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని (పన్నులు, ఇతర రాబడులను) వంద శాతం వసూలు చేయడంపై అధికారులు సీరియస్‌గా దృష్టి సారించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ముఖ్యంగా హెచ్ఎండీఏ, టీజీఐఐసీలు ఆదాయ వనరులను పెంచుకోవడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఆదాయ సమీకరణపై బుధవారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం (ఎంసీహెచ్ఆర్‌డీ)లో జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, సీఎస్ సంజయ్ జాజు సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. బడ్జెట్ లక్ష్యాలను అందుకోవాలంటే నిధుల సమీకరణే ఏకైక మార్గమని స్పష్టం చేశారు. వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, గనుల శాఖల వంటి కీలక రాబడి విభాగాల్లో ఎక్కడా ఆదాయ లీకేజీలు లేకుండా కఠిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఆదాయ సమీకరణ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించడానికి ప్రత్యేకంగా ఒక ‘చేజింగ్ సెల్’ను ఏర్పాటు చేయాలన్నారు. ఊహాజనితంగా కాకుండా, వాస్తవికత ఆధారంగానే బడ్జెట్‌ను రూపొందించుకోవాలని సీఎం చెప్పారు. ప్రాజెక్టుల వారీగా నిధుల కేటాయింపుల్లో భూసేకరణకు మొదటి ప్రాధాన్యమివ్వాలన్నారు.

ప్రభుత్వ పథకాల్లో కృత్రిమ మేధ (ఏఐ)ను ఉపయోగించుకుని లబ్ధిదారుల జాబితాను ‘ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ)’ ప్రక్రియకు అనుసంధానం చేసుకోవాలని సూచించారు. నిధుల సమీకరణ, రాబడి పెంపు విషయంలో అధికారులు నిర్లక్ష్యాన్ని వీడాలని, ప్రభుత్వపరంగా అవసరమైన అన్ని రకాల సహకారాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నామని సీఎం స్పష్టం చేశారు.

## ‘అయోధ్య’ పై నబీన్...(మొదటిపేజీ తరువాయి)

కాగా, యాదగిరిగుట్టను గొప్పగా తీర్చిదిద్దాలన్నది సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచన అని, ఆ నేపథ్యంలోనే పార్టీలు, ప్రాంతాలకు అతీతంగా కొందరు వ్యక్తులు, నిష్ణాతులతో ధర్మకర్తల మండలిని ఏర్పాటు చేశారని తెలిపారు. దాన్ని రాజకీయ కోణంలో చూడాల్సిన అవసరం లేదన్నారు. భగవంతుడి దగ్గర ప్రాంతాలు ఉండవని, టీడీటీ పాలకమండలిలో తెలంగాణ వ్యక్తులు లేరా? అని ప్రశ్నించారు. మండలి నియామకంలో తనను సంప్రదించ లేదంటూ రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలతో తాను ఏకీభవిస్తానని, ఈ అంశంపై తాను రాజగోపాల్‌రెడ్డితో మాట్లాడానని, సీఎంతోనూ మాట్లాడతానన్నారు. అక్కడి అవసరాల దృష్ట్యా కొన్ని నిర్ణయాలు తీసుకుంటామని, అన్నింట్లో అందర్నీ భాగస్వాములను చేయలేమని చెప్పారు.

# వడివడిగా రైతుభరోసా

**రైతుల ఖాతాల్లో నిధుల జమ ..**

**2 రోజుల్లో మూడెకరాల వరకు నగదు బదిలీ పూర్తి**

**9రోజుల్లో పూర్తిచేసేలా ప్రభుత్వం ప్రణాళిక**

**ఇప్పటివరకు 4,072 కోట్లు ఖాతాల్లో జమ**

**సాగుకు పెట్టుబడి సమయంలోనే సాయం**

**హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు**



**హైదరాబాద్, జూలై 1**

వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతుభరోసా నిధులు వేగంగా రైతుల ఖాతాలకు చేరుతున్నాయి. జూన్ 30న (మంగళవారం) శిల్పకళావేదికలో ఖరీఫ్ రైతుభరోసా నిధుల విడుదలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించగా.. అదే రోజు మొదటి విడతగా రెండెకరాల వరకు భూమి కలిగి ఉన్న రైతులకు నిధులు విడుదల చేశారు. ఈ క్యాటగిరీలో 41.37 లక్షల మంది రైతులు ఉండగా.. రూ.2,482 కోట్లు విడుదల చేయడం గమనార్హం. వ్యవసాయ శాఖ ఇచ్చిన డేటా ప్రకారం ఆర్థికశాఖ నగదు బదిలీ చేయగా, బుధవారం ఉదయానికే రైతుల బ్యాంకు ఖాతాలకు నిధులు చేరుకున్నాయి. రైతుల ఫోన్లకు మెసేజ్‌లు కూడా వచ్చాయి. బుధవారం రెండో విడతగా 10.68 లక్షల మంది రైతులకు నగదు బదిలీ చేశారు. మూడెకరాల వరకు భూమి ఉన్న రైతులకు రూ.1,590 కోట్లు విడుదల చేశారు. దీంతో ఇప్పటివరకు 54.96 లక్షల మంది రైతులకు చెందిన 67.87 లక్షల ఎకరాలకు రూ.6 వేల చొప్పున చెల్లింపులు పూర్తయ్యాయి. బుధవారం నాటికి రూ.4,072 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. కాగా, ప్రభుత్వం ఖరీఫ్ రైతుభరోసా చెల్లింపులను 9 రోజుల్లో పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. గతేడాది ఖరీఫ్ సీజన్‌లో కూడా తొమ్మిది రోజుల్లోనే రైతుభరోసా చెల్లింపులు పూర్తిచేసింది. ఈసారి కూడా అదే పద్ధతిలో 9 రోజుల్లో పూర్తిచేసేందుకు నిధుల సమీకరణ చేపట్టింది.

### కోటిన్నర ఎకరాలకు సాయం..

రాష్ట్రవ్యాప్తంగా 73.32 లక్షల మంది పట్టాదారులు ఉన్నారు. కోటిన్నర ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ మొత్తానికి ఎకరానికి రూ.6 వేల చొప్పున పంపిణీ చేసేందుకు రూ.9 వేల కోట్ల నిధులు అవసరమవుతాయి. వీటిని విడతల వారీగా రైతులకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఈ క్రమంలోనే జూన్ 30న మొదటి రోజు రెండెకరాల వరకు చెల్లింపులు చేసింది. రెండో విడతలో రెండెకరాల నుంచి మూడెకరాల వరకు భూమి ఉన్న రైతులకు చెల్లింపులు చేసింది. ఇదే పద్ధతితో రోజుకో ఎకరం చొప్పున పెంచుతూ పోవాలని నిర్ణయించింది. మూడో రోజు 3 నుంచి 4 ఎకరాలకు, నాలుగో రోజు 4 నుంచి 5 ఎకరాలకు, ఐదో రోజు 5 నుంచి 6 ఎకరాలకు, ఆరో రోజు 6 నుంచి 7 ఎకరాలకు, ఏడో రోజు 7 నుంచి 8 ఎకరాలకు, ఎనిమిదో రోజు 8 నుంచి 9 ఎకరాలకు నగదు బదిలీ చేసేలా షెడ్యూలు రూపొందించారు. ఆ తర్వాత చివరి రోజున 10 ఎకరాల నుంచి ఎగువన ఉన్న మొత్తం విస్తీర్ణానికి ఒకేరోజు చెల్లింపులు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**సరిగ్గా పెట్టుబడి సమయంలోనే..**

ఖరీఫ్ సాగుకు రైతులు ఇటీవలే శ్రీకారం చుట్టారు. ?గ ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా నిధులు విడుదల చేస్తోంది. దీంతో పంటల సాగుకు పెట్టుబడి పెట్టే సమయంలోనే ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందుతోందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# రాష్ట్రంలో నిలిచిన రిజిస్ట్రేషన్లు!

**హైదరాబాద్, చిక్కడపల్లి, జూలై 1**

: తెలంగాణ వ్యాప్తంగా సాంకేతిక ఇబ్బందులతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిలిచిపోయింది. బుధవారం ఉదయం నుంచి సర్వర్లు పనిచేయలేదు. స్లాట్ బుకింగ్, చలాన్ల చెల్లింపులు ఆగిపోయాయి. దీంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్ సేవలు మరో 2 రోజులపాటు అందుబాటులో ఉండవు. సర్వర్ల అప్‌గ్రెడేషన్, కొత్త సాంకేతికత పనులు ఇంకా కొనసాగుతున్నాయి. అవి పూర్తయితే గురువారం సాయంత్రం నాటికి రిజిస్ట్రేషన్ శాఖ ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వస్తాయని సమాచారం. హైదరాబాద్ నగరంలోని పలు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. అశోక్‌నగర్‌లోని చిక్కడపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సోమ, మంగళవారాల్లో రిజిస్ట్రేషన్లు జరగలేదు. భూములు, ఫ్లాట్‌ల క్రయవిక్రయాలు, గిఫ్ట్ డీడ్స్, మార్టిగేజ్ డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లన్నీ నిలిచిపోయాయి. కొందరికి స్లాట్‌లు బుక్ అయినా రిజిస్ట్రేషన్లు జరగకపోవడంతో గంటల తరబడి కార్యాలయం వద్దే పడిగాపులు కాయాల్సి వచ్చింది.

# మందమర్రిని ముంచేస్తున్న జీరో చిట్టీల మాఫియా..!

- చిట్టీల పేరుతో లక్షల వసూళ్లు..
- అధిక వడ్డీతో ప్రజల రక్తం పీలుస్తున్న వ్యాపారం..!
- ఆర్థిక ఊబిలో కూరుకుపోతున్న బలహీన వర్గాల బాధితులు
- అప్పులు తీర్చలేక గత్యంతరం లేక ఐపీ పెట్టుకునే పరిస్థితులు

**మందమర్రి, జూలై 01,(మన సమాజం):**
మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలో పాత బస్టాండ్ ప్రాంతంలో జీరో "చిట్టీల దందాకు కేరాఫ్‌గా మారిన వెంకటరెడ్డి అనే వ్యక్తి జీరో చిట్టీల పేరుతో భారీ ఎత్తున ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు చిట్టీల పేరుతో ప్రజల నుంచి లక్షల రూపాయలు వసూలు చేస్తూనే, మరోవైపు అధిక వడ్డీ వ్యాపారం నడుపుతూ ఆర్థికంగా బలహీన వర్గాలను అప్పుల ఊబిలోకి నెట్టేస్తున్నాడని బాధితులు ఆరోపిస్తున్నారు. చిట్టీల్లో చేరిన సభ్యులు క్రమం తప్పకుండా డబ్బులు చెల్లిస్తున్నప్పటికీ, అసలు బకాయిలు తీరకపోగా వడ్డీపై వడ్డీ వేసి మరింత భారాన్ని మోపుతున్నారని బాధితులు వాపోతున్నారు. అప్పులు తీర్చలేక ఇటీవల పట్టణానికి చెందిన ఓ వ్యక్తి దివాలా తీసి(ఐపీ) పెట్టుకునే పరిస్థితి ఏర్పడిందని స్థానికంగా జోరుగా చర్చ జరుగుతోంది.

**అధికారిక అనుమతి లేకుండానే..!**
ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండానే బహిరంగంగా లక్షల రూపాయల చిట్టీల వ్యాపారం సాగుతున్నట్లు ఆరోపణలు ఉన్నప్పటికీ, సంబంధిత అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ఇంత పెద్ద మొత్తంలో ఆర్థిక లావాదేవీలు జరుగుతున్నా అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. చట్టాలకు విరుద్ధంగా ఎవరైనా చిట్టీల వ్యాపారం లేదా అధిక వడ్డీ వ్యాపారం నిర్వహిస్తున్నట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి సమగ్ర విచారణ చేపట్టాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారంలో నిజానిజాలు వెలికితీసి, ప్రజల కష్టార్జితాన్ని కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అభిప్రాయ పడుతున్నారు.

**కఠిన చర్యలే సరైన మార్గం...**



జీరో చిట్టీ వ్యాపారుల పై కఠిన చర్యలు చేపట్టడమే పరిష్కార మార్గమని పట్టణ ప్రజలు భావిస్తున్నారు. వడ్డీ మీద వడ్డీ వేస్తూ.. బలహీన వర్గాల ప్రజలను ఆర్థిక, మానసిక ఇబ్బందులకు గురి చేస్తున్నారని కూడా అంటున్నారు. గతంలో పోలీస్ ఉన్నతాధికారులు ప్రైవేట్ ఫైనాన్స్ నిర్వాహకులు, గిరిగిరి నిర్వహణదారుల పై ఉక్కుపాదం మోపిన విషయం తెలిసిందే. దరిమిలా మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా ఫైనాన్స్ లు మూతబడ్డాయి. అనుమతి లేని ఫైనాన్స్ లను వెంటనే మూసేసి పెట్టే బేడా సర్దుకున్నా.. ఈ జీరో చిట్టీలు మాత్రం లోలోన జరుగుతూనే ఉన్నాయి. సామాన్య ప్రజల ఆర్థిక అవసరాలను ఆసరా చేసుకుని కొంత మంది వ్యాపారులు దొడ్డి దారిన సొమ్ము చేసుకునేందుకే అలవాటు పడుతున్నారు. కఠిన ఆదేశాలు ఉన్నా.. గుట్టు చప్పుడు కాకుండా కొన్ని చోట్ల గిరిగిరి నడుపుతూనే ఉన్నారు. ఇప్పటికైనా.. పోలీస్ అధికారులు చొరవ తీసుకుని చిట్టి వ్యాపారుల ఆగడాలకు ఆర్థికంగా చిన్నాభిన్నం అవుతున్న కుటుంబాలకు ఉపశమనం కలిగించాలని పలువురు కోరుతున్నారు.

# రెండేళ్ల పాలనలో అన్ని స్కాంలే..

**సింగరేణి నిధులతో సీఎం సోకులు.**
**అప్పులకుప్పగా సింగరేణి..**
**విద్య వట్టిదే.. వైద్యం ఉత్తదే..**
**మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు..**

**రామకృష్ణాపూర్ జూలై 1, (మన సమాజం ):**
కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల పాలనలో సింగరేణిలో అన్ని స్కాంలే జరిగాయె తప్ప కార్మికులకు, సంస్థకు ఒరిగింది ఏమీ లేదని మాజీ మంత్రి సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు అన్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రామకృష్ణాపూర్ ఎమ్మెన్నార్ గార్డెన్ లో నిర్వహించిన సింగరేణి పరిరక్షణ సదస్సు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సింగరేణిలో జరుగుతున్న అవినీతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ రూపంలో కార్మికులకు క్లుప్తంగా వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సింగరేణి కార్మికులు, సంస్థ ఆగమాగం అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన మాట ప్రకారం గత బిఆర్ఎస్ ప్రభుత్వం 16,000 మందికి డిపెండెంట్ ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కేసిఆర్ కే దక్కిందన్నారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ప్రభుత్వం సింగరేణికి 7వేల కోట్ల బకాయిలు ఉంటే నేడు కాంగ్రెస్ హయాంలో 12,377 కోట్ల బకాయిలు ప్రభుత్వం ఉందన్నారు. సింగరేణి లాభాల్లో ఉందని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం 4300 కోట్లు ఒడి , బ్యాంక్ అప్పులు ఎందుకు ఉందని ప్రశ్నించారు. సింగరేణిలో 51 శాతం రాష్ట్ర ప్రభుత్వం, 49 శాతం కేంద్ర ప్రభుత్వం వాటా ఉన్నప్పటికీ సింగరేణిలో జరుగుతున్న అవినీతిపై కేంద్ర ప్రభుత్వం మౌనంగా ఉండడం అనేక అర్థాలకు దారితీస్తుందన్నారు. సింగరేణిని దివాలా తీయించి ప్రైవేటీకరణం చేసే యోచనలో కాంగ్రెస్ బిజెపి కుట్రలు చేస్తుందని కార్మికులకు తెలియజేశారు. కాంగ్రెస్ హటావో సింగరేణి బచావో ఉద్యమానికి నేటి నుండి శ్రీకారం చుట్టడానికి కార్మిక లోకం సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.





**అన్ని స్కాంలే!**
సింగరేణిలో 40 లక్షల టన్నుల బొగ్గు స్కామ్ జరిగిందని సిద్దిపేట ఎమ్మెల్యే మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. సోలార్ పవర్ స్కాం, సెట్ విజిట్ సర్టిఫికెట్ స్కాం, జైపూర్ పవర్ స్కాం, ఎక్స్ ప్లోజీవ్ స్కాం, డిజిల్ స్కాం ఇలా ఎక్కడ చూసినా స్కాంలే తప్ప స్కింలు కనబడడం లేదని ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం పై మండిపడ్డారు. సైట్ విజిట్ సర్టిఫికెట్ విధానంను నైని బ్లాక్ లో రద్దు చేసిన డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క సింగరేణి వ్యాప్తంగా మిగతా 9 టెండర్లలో ఎందుకు రద్దు చేయలేదని ప్రశ్నించారు. 107 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టులో భారీ అవినీతి, 67 మెగావాట్ల పవర్ ప్లాంట్ టెండర్లలో అవకతవకలు జరిగాయని తెలిపారు. సోలార్ పవర్ ప్లాంట్ ల కోసం 1000 కోట్ల రూపాయలను ఎందుకు ఖర్చు చేశారనేది బట్టి విక్రమార్క కార్మికులకు సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణ జెన్కో లో 79% బొగ్గు కొరత సింగరేణి పవర్ ప్లాంట్ లో 84% బొగ్గు కొరత ఉందన్నారు. బిఆర్ఎస్ పాలనలో 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలువలు ఉంటే నేడు కాంగ్రెస్ పాలనలో 50 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి ఉందన్నారు. సింగరేణి సొమ్ముతో సీఎం రేవంత్ రెడ్డి సోకులు చేస్తూ ఫుట్బాల్ పోటీలకు వంద కోట్లు ఎందుకు ఖర్చు చేశారన్నారు. ఎన్నికల సమయంలో సింగరేణిని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని మాయమాటలు చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, కార్పొరేట్ విద్యా వట్టిదే, వైద్యం ఉత్తదే అయిందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం 16,000 మందికి డిపెండెంట్ ఉద్యోగాలు కల్పిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం డిపెండెంట్ ఉద్యోగాలు ఇవ్వకపొగ కార్మికులను గోస పెడుతుందన్నారు. అవినీతిమయమైన సింగరేణిని, కార్మికుల సంక్షేమాన్ని కాపాడడానికి బిఆర్ఎస్, టీబిజీకేఎస్ యూనియన్ ముందుంటుందన్నారు.

**సింగరేణిని బొందల గడ్డగా మారుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం..**
**మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్..**
సింగరేణిని బొందలగడ్డగా కాంగ్రెస్ ప్రభుత్వం మారుస్తుందని చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ మండిపడ్డారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో సింగరేణి కార్మికులకు అన్యాయం జరుగుతుందన్నారు. పురోగతిలో ఉన్న సింగరేణి సంస్థ నేడు అప్పుల ఊబిలో కూరుకుపోయే పరిస్థితిని రేవంత్ రెడ్డి తెచ్చారన్నారు. వెలవెల బోతున్న సింగరేణిని కాపాడడానికి రాష్ట్రంలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బొగ్గు గనులలో జరుగుతున్న అవినీతికి గనుల శాఖ మంత్రి అయిన గడ్డం వివేక్ వెంకటస్వామి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోవా లక్ష్మి, మాజీ ఎమ్మెల్యేలు దివాకర్ రావు, దుర్గం చిన్నయ్య, పుట్ట మధు, కోనేరు కోనప్ప, టీబీజీకేఎస్ గౌరవాధ్యక్షులు కొప్పుల ఈశ్వర్ నాయకులు మిరియాల రాజిరెడ్డి, మేడిపల్లి సంపత్, క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్ గోడిసెల సంధ్యారాణి-రాజా రమేష్, మంచిర్యాల మాజీ మార్కెట్ చైర్మన్ పల్లె భూమేష్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



**లక్షెట్టిపేట జులై01(మన సమాజం)**
గుమ్మడి రాజలింగం ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోతపెల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వాటర్ బాటిళ్లు, స్కూల్ బ్యాగులు, ప్యాడ్లు, ఇతర విద్యా క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు గుమ్మడి కిరణ్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల పేద విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందించడం ద్వారా వారి చదువుకు ప్రోత్సాహం అందించడమే ఫౌండేషన్ లక్ష్యమని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నైనాల లక్ష్మి శంకరయ్య, ఉపసర్పంచ్ భూపెల్లి మల్లేష్, మాజీ సర్పంచ్ పురుషోత్తం చరణ్ పవన్ పాఠశాల ఉపాధ్యాయురాలు సంధ్యారాణి తదితరులు పాల్గొని విద్యార్థులకు సామగ్రిని పంపిణీ చేశారు.

## 12వ వెజ్ బోర్డ్ కమిటీ వేయాలి..




**రామకృష్ణాపూర్, జూలై 1, (మన సమాజం):**
సింగరేణిలో 12వ వేజ్ బోర్డ్ కమిటీ వేసి వెంటనే అమలు చేయాలని జేఏసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మందమర్రి ఏరియా రామకృష్ణాపూర్ సిహెచ్పిలో నాయకులు కార్మికులతో కలిసి బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన మెమొరండమును అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని, లేనిపక్షంలో ఐక్య సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అక్బర్ అలీ, రామకృష్ణ, మంతెన గోపి, రామస్వామి, సతీష్, సీతారామారావు, సిరాజుద్దీన్, శ్రీధర్ రావు, శ్రీనివాస్, నాగరాజు, మల్లమ్మ, రజిత, చిలుకమ్మ, అనిత పాల్గొన్నారు.

## ఘనంగా పెద్దమ్మ తల్లి బోనాలు..





**రామకృష్ణాపూర్, జూలై 1, (మన సమాజం):**
క్యాతనపల్లి మున్సిపాలిటీ 7వ వార్డు గద్దరాగడి గ్రామంలో ముదిరాజ్ కులస్తుల పెద్దమ్మ తల్లి బోనాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. డీజే పాటలతో ముదిరాజుల ఇంటింటి నుండి మహిళలు నెత్తిన బోనమెత్తుకొని నూతనంగా నిర్మిస్తున్న పెద్దమ్మతల్లి ఆలయం వద్ద బోనం సమర్పించారు. ముందుగా పోచమ్మ తల్లి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. స్థానిక కౌన్సిలర్ గుర్రం శ్రీనివాస్ మాట్లాడుతూ ముదిరాజుల ఆరాధ్య దైవమైన పెద్దమ్మ తల్లికి బోనం సమర్పించడం ఆనవాయితీగా వస్తుందని పేర్కొన్నారు. తల్లి ఆశీస్సులు గ్రామ ప్రజలతో పాటు మున్సిపాలిటీ ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు. బోనం వేడుకలకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ వేడుకల్లో ముదిరాజు సంఘం సభ్యులు, కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





# అతని వల్లే డ్యాన్స్‌లో పర్‌ఫెక్షన్!

ఇరవైఏండ్ల సుదీర్ఘ కెరీర్‌లో ఎన్నో హిట్ చిత్రాల్లో భాగమైంది అగ్ర కథానాయిక తమన్నా. హీరోయిన్‌గా రాణిస్తూనే మరోవైపు ప్రత్యేక గీతాల ద్వారా యూత్‌లో క్రేజ్ దక్కించుకుంది. ఇటీవలకాలంలో 'స్త్రీ-2' చిత్రంలో 'ఆజ్ కీ రాత్..' పాట బాగా పాపులర్ అయింది. తమన్నా నటించిన 'డూ యూ వాన్నా పార్ట్‌నర్' అనే వెబ్‌సిరీస్ ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతున్నది. ఈ సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో డ్యాన్స్‌లో తన ప్రతిభకు కారణం అల్లు అర్జున్ అని వెల్లడించింది. "బద్రీనాథ్' టైంలో డ్యాన్స్ విషయంలో బన్నీ బాగా ఎంకరేజ్ చేశారు. మంచి పర్‌ఫెక్షన్‌తో డ్యాన్స్ ఎలా చేయాలో అతని నుంచి నేర్చుకున్నా. ఆ సినిమా తర్వాత నాకు డ్యాన్స్ పరంగా చాలా ఆఫర్లొచ్చాయి. స్పెషల్ సాంగ్స్‌తో కూడా పాపులర్ అయ్యాను' అని చెప్పింది తమన్నా. ఈ ఏడాది 'ఓదెల-2' చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చింది తమన్నా. ప్రస్తుతం ఈ భామ హిందీలో నాలుగు చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది.



## మీనాక్షి చౌదరి ట్రావెల్ డైరీ స్పెషల్..

ఇచట వాహనములు నిలుపరాదు సినిమాతో తెలుగు ప్రేక్షకులకు హాయ్ చెప్పింది హర్యానా సుందరి మీనాక్షి చౌదరి. ఆ తర్వాత హిట్ 2, గుంటూరు కారం సినిమాలతో హిట్స్‌ను ఖాతాలో వేసుకుంది. గతేడాది మాలీవుడ్ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్‌తో కలిసి నటించిన లక్కీ భాస్కర్ బాక్సాఫీస్ వద్ద వసూళ్ల వర్షం కురిపించింది. ఎప్పుడూ ఏదో ఒక ప్రొఫెషనల్ కమిట్‌మెంట్స్‌తో ఫుల్ బిజీగా ఉండే ఈ భామ కాస్త బ్రేక్ తీసుకొని వెకేషన్ టూర్ ప్లాన్ చేసుకుంది. ఇంతకీ మీనాక్షి చౌదరి ఎక్కడికెళ్లిందనుకుంటున్నారా..? ఈ భామ జపాన్ దేశానికి టూర్ వేసింది. స్టైలిష్ డ్రెస్‌లో ఉన్న మీనాక్షి జపాన్ వీధుల్లో వర్షం పడుతుంటే గొడుగు పట్టుకొని మాన్‌సూన్ అందాలను ఆస్వాదించింది. ఈ ఫొటోలపై మీరూ ఓ లుక్కేయండి మరి. ఓ వైపు ఛమక్కుమని మెరుస్తున్న చెవిపోగులు, మరోవైపు సాధారణ పోనీటైల్ లాంటి జుట్టుతో ఉన్న ఈ చిన్నది అందమైన చిరునవ్వుతో అందరినీ ఆకర్షిస్తోంది. ప్రతీ వీధిలో మీనాక్షి చౌదరి దిగిన ఫొటోలు జపాన్ టూర్‌ను ఎలా ఎంజాయ్ చేసిందో చెప్పకనే చెబుతున్నాయి. జపాన్ వెకేషన్‌లోని ప్రతీ ఫ్రేమ్ తన ట్రావెల్ డైరీలో ప్రత్యేకంగా నిలిచిపోయేలా కెమెరాకు స్టన్నింగ్ ఫోజులిచ్చింది. 'కొన్ని యాదృచ్ఛిక విషయాలు, సంఘటనలు మనలో శాశ్వత ముద్ర వేస్తాయి. ఈ అద్భుతమైన రోజు నుండి నాకు అలాంటి ఒక జ్ఞాపకం లభించినందుకు నేను కృతజ్ఞురాలినని భావిస్తున్నాను. జపాన్‌లో మేము ఒక అందమైన కేఫ్‌ను గుర్తించాం. అద్భుతమైన వర్షాభావ దృశ్యాల నుండి అక్కడి అందమైన మనుషులతో అందంగా తయారు చేసిన జపనీస్ టీ వరకు అన్నీ ఆస్వాదించాం' అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో క్యాప్షన్ పెట్టింది. ఈ ఏడాది సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న మీనాక్షి చౌదరి. ప్రస్తుతం అనగనగా ఒక రాజు సినిమాలో నటిస్తోంది.

# రెండు వేలకు మించి ఖర్చుపెట్టను!

అరంగ్రేటం చేసిన అనతికాలంలోనే తెలుగులో మంచి ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది 'సీతారామం' ఫేమ్ మృణాల్ ఠాకూర్. ప్రస్తుతం హిందీ,



తెలుగు భాషల్లో ఈ భామ భారీ చిత్రాల్లో నటిస్తున్నది. అల్లు అర్జున్-అట్లీ కాంబో చిత్రంలో ఈ సొగసరి ఓ కథానాయికగా నటిస్తున్నట్లు వార్తలొస్తున్నా యి. వరుస భారీ సినిమాలతో ఆర్థికంగా కోరుకున్న స్థాయికి చేరుకున్నప్పటికీ..ఖర్చు విషయంలో మాత్రం పొదుపు పాటిస్తుందట ఈ అమ్మడు. ఇటీవల ఓ ఇంటర్వ్యూ సందర్భంగా డబ్బుపై నియంత్రణ ఉండాలంటూ మృణాల్ చెప్పిన మాటలు సోషల్‌మీడియాలో వైరల్ అయ్యాయి. 'నాకు ఖరీదైన దుస్తులు కొనడం అస్సలు ఇష్టం ఉండదు. వాటి కోసం ఎంతో ఖర్చుపెడతాం. ఏదో ఒక సందర్భంలో ధరించడం తప్ప అవి ఎక్కువ సమయం బీరువాల్లోనే ఉండిపోతాయి. అందుకే దుస్తుల విషయంలో రెండుమూడు వేలకంటే ఎక్కువగా ఖర్చు చేయను. ఫిల్మ్ ఈవెంట్స్‌కు మాత్రం కాస్త ఖరీదైన డిజైనర్ క్లాత్స్ ధరిస్తాను. అయితే వాటిని అద్దెకు తెచ్చుకుంటాను. అంత డబ్బులు పెట్టి ఎప్పుడూ బట్టలు కొనను' అని చెప్పుకొచ్చింది మృణాల్ ఠాకూర్.

## అదే సక్సెస్ అనుకున్నా.. టార్గెట్ పెట్టుకున్నా.. కానీ

దాదాపు మూడేళ్లగా మయోసైటిస్ అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్నారు సమంత చికిత్స తీసుకుంటూనే ఇటు సినిమాలు, అటు ప్రొడక్షన్ హౌస్ పనులు చూసుకుంటోంది. అయితే మయోసైటిస్‌తో పోరాటం తనకెన్నో విషయాలు నేర్పిందని చెబుతున్నారామె. ఒకప్పటితో కంపేర్ చేస్తే ఇప్పుడు ఎన్నో విషయాల్లో తనలో మార్పు వచ్చిందన్నారు సామ్. ఇటీవల ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మయోసైటిస్ వల్ల జీవితంలో దేనికి ఇంపార్టెన్ ఇవ్వాలో అర్థమైంది. దానితో చేసిన ఆ పోరాటం నన్ను ఎంతగానో మార్చేసింది. గతంలో విజయం అంటే గ్యాప్ లేకుండా సినిమాలు చేయడం అనుకునేదాన్ని. ఏడాదిలో నేను నటించిన ఐదు సినిమాలు విడుదలైన సందర్భాలున్నాయి. అదే సక్సెస్ అని నమ్మి మురిసిపోయేదాన్ని. వరుసగా సినిమాలు చేయాలి, పెద్ద బ్లాక్‌బస్టర్స్‌లో నటించాలి. టాప్ 10 నటీనటుల లిస్ట్‌లో ఉండాలి అని భావించేదాన్ని. బుర్రలో ఎప్పుడూ అదే ఆలోచన. కానీ ఇప్పుడు నా ఆలోచనల్లో మార్పు వచ్చింది. వివరం తెలిసింది. రెండేళ్లుగా నా సినిమాలు విడుదల కాలేదు, టాప్ 10 లిస్ట్‌లోనూ లేను. అలాగే నా దగ్గర రూ.1000 కోట్ల సినిమాలు అంతకన్నా లేవు. అయినా నేను ఇప్పుడు ఉన్నంతలో సంతోషంగానే ఉన్నా' అని అన్నారు. 'ఖుషి' చిత్రం తర్వాత సమంత మరో చిత్రానికి సైన్ చేయలేదు. తన సొంత బ్యానర్‌లో ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌లో వచ్చిన 'శుభం' చిత్రంలో గెస్ట్ రోల్ చేశారు. ప్రస్తుతం తన సొంత బ్యానర్‌లోనే 'మా ఇంటి బంగారం' చిత్రం మాత్రమే తన చేతిలో ఉంది. ఆ సినిమా షూటింగ్ అప్‌డేట్ ఏమీ లేదు.

